భారత్ వైట్

ఛేదనలో చేతులెత్తేసిన బ్యాటర్లు

రోహిత్ సేనకు [illegible]వం • 3-0తో సిరీస్ కివీస్ కైవసం

అనూహ్య మలుపులు తిరిగిన ముంబై టెస్టులో భారత్‌కు అభిమానులు ఎంతమాత్రమూ జీర్ణించుకోలేని అవమానకర ఓటమి ఎదురైంది. న్యూజిలాండ్ స్పిన్ ఉచ్చులో పడి భారత బ్యాటర్లు విలవిల్లాడిన వేళ.. 24 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత టీమ్‌ఇండియా స్వదేశంలో వైట్‌వాష్ అయింది. బంతి గింగిరాలు తిరిగిన వాంఖడే పిచ్‌పై పర్యాటక జట్టు నిర్దేశించిన 147 పరుగులను ఛేదించలేక రోహిత్ సేన 121 పరుగులకే చేతులెత్తేసింది. రిషభ్ పంత్ ఒంటరి పోరాటం మినహా భారత స్టార్ బ్యాటర్లంతా అత్యంత చెత్త ఆట ఆడి వికెట్లను సమర్పించుకోవడంతో న్యూజిలాండ్ చారిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్ స్పిన్ ద్వయం రాణించడంతో కివీస్ సిరీస్ విజయాన్ని పరిపూర్ణం చేసుకుంది. స్వదేశంలో 1933 నుంచి టెస్టులు ఆడుతున్న భారత్.. సొంతగడ్డపై మూడు అంతకుమించి టెస్టులు ఆడుతూ వైట్‌వాష్ అవడం ఇదే తొలిసారి.

రోహిత్ (11)

దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. ముంబైలోని వాంఖడే వేదికగా జరిగిన ఆఖరి టెస్టు మూడో రోజు ఆటలో కివీస్ నిర్దేశించిన 147 పరుగుల స్వల్ప ఛేదనలో రోహిత్ సేన.. 121 పరుగులకే కుప్పకూలి 25 పరుగుల తేడాతో అపజయం పాలైంది. ఛేదనలో రిషభ్ పంత్ (57 బంతుల్లో 64, 9 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే పోరాడగా మిగిలిన టాపార్డర్ బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే చేతులెత్తేయడంతో 'మెన్ ఇన్ బ్లూ'కు పరాభవం తప్పలేదు. కివీస్ స్పిన్నర్ అజాజ్ పటేల్ (6/57) వాంఖడేలో మరోసారి అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేయగా గ్లెన్ ఫిలిప్స్ (3/42) కూడా దెబ్బకొట్టడంతో ఆ జట్టు సరికొత్త చరిత్రను సృష్టించింది. ఈ టెస్టులో 11 వికెట్లు పడగొట్టిన అజాజ్ పటేల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కగా విల్ యంగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది.

ఒక్కరూ నిలబడలె..

ఓవర్ నైట్ స్కోరు (171)కు మరో 3 పరుగులు మాత్రమే జోడించిన కివీస్ ఆలౌట్ అయి భారత్ ఎదుట 147 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. ఛేదనలో 3వ ఓవర్ నుంచే భారత్‌కు కష్టాలు మొదలయ్యాయి. సిరీస్‌లో దారుణంగా విఫలమవుతున్న కెప్టెన్ రోహిత్ శర్మ (11) హెన్రీ వేసిన బంతిని పుల్ షాట్ ఆడబోయి మిడ్‌వికెట్ వద్ద ఫిలిప్స్‌కు చిక్కడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. తర్వాత అజాజ్ వరుస ఓవర్లలో షాకులిచ్చాడు. 4వ ఓవర్ ఆఖరి బంతికి అతడు శుభ్‌మన్ గిల్ (1)ను క్లీన్‌బౌల్డ్ చేయగా తన మరుసటి ఓవర్లో కోహ్లీ (1)ని పెవిలియన్‌కు పంపాడు. 7వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన ఫిలిప్స్.. జైస్వాల్(5)ను వికెట్ల ముందు బలిగొన్నాడు. సర్ఫరాజ్ ఖాన్ (1) స్వీప్ షాట్ ఆడబోయి డీప్ స్క్వేర్ వద్ద రచిన్ చేతికి చిక్కడంతో భారత్ 29 పరుగులకే సగం వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. 16 పరుగుల వ్యవధిలో ఐదుగురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు చేరారు.

అజాజ్ (6/57)

ఆదుకున్న పంత్..

ఎదుర్కున్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన పంత్.. రవీంద్ర జడేజా (6)తో కలిసి ఒంటరి పోరాటం చేశాడు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 42 పరుగులు జోడిస్తే అందులో పంత్‌వే 32. పంత్ ఒక్కో పరుగు కూడబెడుతూ లక్ష్యం దిశగా సాగుతున్న క్రమంలో 16వ ఓవర్ వేసిన అజాజ్.. జడేజాను ఔట్ చేసి మరోసారి భారత్‌ను దెబ్బకొట్టాడు. లంచ్‌కు ముందు ఓవర్‌లో పంత్ రెండు ఫోర్లు కొట్టి 48 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. రెండో సెషన్‌లో భారత్ విజయానికి 55 పరుగులు అవసరమవగా అజాజ్ 22వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన పంత్.. నాలుగో బంతికి థర్డ్ అంపైర్ వివాదాస్పద డీఆర్ఎస్ నిర్ణయంతో వెనుదిరిగాడు. పంత్ నిష్క్రమించాక 8 ఓవర్లలోపే భారత లోయరార్డర్ కుప్పకూలింది. వాషింగ్టన్ సుందర్ (12) ఆశలు కల్పించినా అతడి పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది.

1 ఒక టెస్టు సిరీస్‌లో వరుసగా మూడు టెస్టులు గెలవడం న్యూజిలాండ్‌కు స్వదేశంతో పాటు విదేశాల్లోనూ ఇదే మొదటిసారి.

91 ఏండ్ల భారత క్రికెట్ చరిత్రలో సొంతగడ్డపై 3 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడుతూ వైట్‌వాష్ అవడం టీమ్‌ఇండియాకు ఇదే ప్రథమం.

ఇరు జట్ల లెఫ్టార్మ్ స్పిన్నర్లు (జడేజా, అజాజ్) రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం టెస్టు క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి.

3 స్వదేశంలో వైట్‌వాష్ ఎదుర్కున్న సారథులలో రోహిత్ శర్మ మూడోవాడు. గుండప్ప విశ్వనాథ్ (1980లో ఇంగ్లండ్‌పై), సచిన్ టెండూల్కర్ (2000లో సౌతాఫ్రికాపై) తర్వాత ఆ చెత్త రికార్డును రోహిత్ మూటగట్టుకున్నాడు.

4 భారత్‌ను స్వదేశంలో ఇంగ్లండ్ (4సార్లు), ఆసీస్ (3 సార్లు), వెస్టిండీస్ (ఒకసారి) తర్వాత క్లీన్‌స్వీప్ చేసిన నాలుగో జట్టు కివీస్.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 263 ఆలౌట్; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 174 ఆలౌట్; భారత్ రెండో ఇన్నింగ్స్: 121 ఆలౌట్ (పంత్ 64, సుందర్ 12, అజాజ్ 6/57, ఫిలిప్స్ 3/42)

పంత్ ఔట్‌పై వివాదం

పంత్ (64)

మ్యాచ్‌లో పంత్ ఔట్ అయిన తీరుతో మరోసారి డీఆర్ఎస్ ఫలితాలపై చర్చ మొదలైంది. అజాజ్ వేసిన బంతిని పంత్ డిఫెన్స్ చేయబోయాడు. కానీ అదికాస్తా మిస్ అయి వికెట్ కీపర్ బ్లండెల్ చేతిలో పడింది. కివీస్ అప్పీల్ చేసినా అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో ఆ జట్టు డీఆర్ఎస్ తీసుకుంది. టీవీ రిప్లేలో బంతి బ్యాట్ అంచును ముద్దాడుతూ ప్యాడ్లను తాకినట్టు స్పష్టంగా తేలింది. అదే సమయంలో బ్యాట్ సైతం ప్యాడ్‌ను తాకినట్టు ఉందనే అనుమానాన్ని పంత్ ఆన్‌ఫీల్డ్ అంపైర్ దృష్టికి తీసుకెళ్లాడు. కానీ థర్డ్ అంపైర్ మాత్రం దీనిని ఔట్‌గా ప్రకటించడం భారత క్రికెట్ అభిమానులను నిరాశకు గురిచేసింది.

సీనియర్లకు రోకో

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

గడిచిన దశాబ్దంన్నర కాలంగా భారత క్రికెట్ జట్టుకు ఆ ఇద్దరూ మూలస్తంభాలుగా ఉన్నారు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా క్రీజులోకి వస్తే దూకుడే పరమావధిగా బౌలర్లపై విరుచుకుపడే స్వభావం ఒకరిదైతే ప్రపంచంలో పిచ్, బౌలర్‌తో సంబంధం లేకుండా పరిస్థితులకు తగ్గట్టు ఆడుతూ ఆధునిక క్రికెట్‌లో మేటి బ్యాటర్‌గా ఎదిగిన ఆటగాడు మరొకరు. కానీ ఈ ఇద్దరూ కొంతకాలంగా భారత బ్యాటింగ్‌కు మార్గదర్శులుగా ఉండాల్సింది పోయి జట్టుకు భారంగా మారుతున్నారు. ఆ ఇద్దరు ఎవరో కాదు సారథి రోహిత్ శర్మ, పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ. స్వదేశంలో కివీస్ చేతిలో ఓటమి కంటే ఈ ఇద్దరి ఆటతీరే భారత క్రికెట్ అభిమానులను అత్యంత ఆందోళనకు గురిచేస్తోంది. జట్టు ఓటమిని ఒకరిద్దరి మీదకు నెట్టడం సరైనది కాకపోయినా సుదీర్ఘ అనుభవం కలిగిన ఈ ద్వయం వైఫల్యం భారత ఓటమికి ప్రధాన కారణం అని చెప్పక తప్పదు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో రోహిత్.. 6 ఇన్నింగ్స్‌లలో కలిపి 15.17 సగటుతో 91 పరుగులు చేస్తే కోహ్లీ 15.53 సగటుతో 93 పరుగులు చేశాడు. గత 10 ఇన్నింగ్స్‌లలో రోహిత్ స్కోర్లు 6, 5, 23, 8, 23, 2, 52, 0, 8, 18, 11 గా ఉంటే కోహ్లీ 6, 17, 47, 29, 0, 70, 1, 17, 4, 1 చేశాడు. వీరి వైఫల్యాన్ని గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. స్పిన్‌ను బాగా ఆడగలిగే ఈ ఇద్దరూ గత మూడు మ్యాచ్‌లలోనూ దారుణంగా చతికిలపడ్డారు. గిల్, జైస్వాల్, పంత్ వంటి కుర్రాళ్లు స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కుంటుంటే ఈ ఇద్దరు మాత్రం పదే పదే తమ బలహీనతలను బయటపెడుతూ అత్యంత చెత్త షాట్లతో పెవిలియన్‌కు చేరారు. వాస్తవానికి ఈ టెస్టు సిరీస్‌కు ముందు శ్రీలంక చేతిలో ఆడిన రెండు టెస్టులూ ఓడి భారత్‌కు వచ్చిన న్యూజిలాండ్ స్పిన్నర్లు అక్కడ తేలిపోయారు. పూణె టెస్టులో మాత్రమే ఆడినా మిచెల్ శాంట్నర్‌తో పోల్చితే అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్ అంత ప్రమాదకరమైన స్పిన్నర్లు కాకపోయినా వీళ్ల బౌలింగ్‌నూ ఎదుర్కోవడానికి రోహిత్, కోహ్లీ తంటాలు పడ్డారు. బోర్డర్ గవాస్కర్ వంటి కీలక సిరీస్‌కు ముందు జరిగిన న్యూజిలాండ్ సిరీస్‌లో ఈ ఇద్దరి దారుణ వైఫల్యంతో వీరి భవితవ్యం కూడా ప్రమాదంలో పడింది. విదేశీ గడ్డపై చతికిలపడ్డా చూసీ చూడనట్టు వదిలేసే అభిమానులు ఏండ్లకేండ్లుగా ఆడుతున్న సొంతగడ్డపై ఇంత బాధ్యతారాహిత్యంగా ఆడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే సిరీస్ ముగిసిన వెంటనే ఈ ఇద్దరిపై నెట్టింట ట్రోలింగ్ పతాకస్థాయికి చేరింది. 'రోకో' గౌరవంగా జట్టు నుంచి తప్పుకుంటే మంచిదని, ఆస్ట్రేలియాలో కూడా ఇదే పునరావృతమైతే వారిపై వేటు వేసి యువ ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

ఇక కష్టమే!

దుబాయ్: న్యూజిలాండ్ చేతిలో సిరీస్ ఓటమి భారత వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను దారుణంగా దెబ్బతీసింది. ముంబై టెస్టుకు ముందు 62.82 శాతం పాయింట్లతో అగ్రస్థానాన ఉన్న టీమ్‌ఇండియా.. మ్యాచ్ తర్వాత 58.33 శాతం పాయింట్లతో రెండో స్థానానికి దిగజారింది. 62.50 శాతం పాయింట్లతో ఆస్ట్రేలియా మొదటి స్థానానికి ఎగబాకింది. ఈ సైకిల్ (2023-25)లో భారత్ మరో ఐదు టెస్టులు ఆడనుంది. ఇతర ఫలితాలతో సంబంధం లేకుండా ఆస్ట్రేలియాను 4-0తో ఓడిస్తేనే భారత్ ఫైనల్ చేరుతుంది. ఆసీస్‌ను ఇంతతేడాతో ఓడించడం అత్యంత సవాల్‌తో కూడుకున్నదే. ఫైనల్ రేసులో భారత్‌తో పాటు శ్రీలంక (55.56), న్యూజిలాండ్ (54.55), సౌతాఫ్రికా (54.17) కూడా ఉన్నాయి.

బాక్సర్లకు 17 పతకాలు

కొలరాడో (యూఎస్ఏ): అమెరికా వేదికగా జరిగిన మొదటి అండర్-19 వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నీలో భారత్ ఏకంగా 17 పతకాలు సాధించింది. పార్థవి (65 కి.), వంశిక (80 కి.), క్రిషా (75 కి.) మహిళల విభాగంలో మెరవగా పురుషుల విభాగంలో హేమంత్ సంగ్వాన్ (90 కి.) పసిడి పంచ్ విసిరాడు. మరో 8 మంది బాక్సర్లు (నిషా, సుప్రియా, క్రితిక, చంచల్, అంజలి, విని, ఆకాంక్ష, రాహుల్) రజతాలు సాధించారు. రిషి సింగ్, క్రిష్, సుమిత్, లక్ష్య, ఆర్యన్ కాంస్యాలు నెగ్గారు.

చిత్రం

'ఇంద్ర'ను తలపించేలా?

రామ్‌చరణ్ 'గేమ్‌చేంజర్' జనవరి 10న సంక్రాంతి కానుకగా విడుదలవుతున్న విషయం తెలిసిందే. దర్శకుడు శంకర్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ ఇంట్రడక్షన్ ఫైట్ గురించి ఫిల్మ్ సర్కిల్స్‌లో ఆసక్తికరమైన చర్చ నడుస్తుంది. ఈ ఒక్క ఎపిసోడ్ కోసమే నిర్మాత దిల్‌రాజు కోట్లు ఖర్చు చేశారని ఇన్‌సైడ్ వర్గాలు చెబుతున్నాయి. ట్రైన్‌లో వస్తున్న రామ్‌చరణ్‌ని రౌడీలు అటకాయించడంతో ఈ ఫైట్ మొదలవుతుందట. రైలు పట్టాలపై జరిగే ఈ భారీ ఫైట్లో వందల సంఖ్యలో ఫైటర్లు పాల్గొన్నారని, సన్నివేశం డిమాండ్ మేరకు హెలికాప్టర్‌ని కూడా వాడారని సమాచారం. కథలో చాలా కీలకమైన ఎపిసోడ్ ఇదని ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి 'ఇంద్ర' హెలికాప్టర్ ఫైట్‌ని గుర్తు చేసేలా ఈ ఫైట్ ఉంటుందని తెలుస్తున్నది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.

పిచ్చిరాతలు రాయకండి

నిర్మొహమాటంగా మాట్లాడి వార్తల్లో నిలుస్తుంటుంది అందాలభామ తాప్సీ పన్ను. రీసెంట్‌గా ఆమె ఓ ఇంటర్వ్యూలో చేసిన వాఖ్యలు బీటౌన్‌లో చర్చనీయాంశమయ్యాయి. 'డంకీ, జూడ్వా2 చిత్రాలకు పెద్దమొత్తంలో పారితోషికాలు అందుకున్నానని ఈ మధ్య కొందరు నాపై కథనాలు రాసేశారు. వారికి తెలీని విషయం ఏంటంటే, కథానాయికలు అడిగినంత పారితోషికాలు ఇచ్చేలా పరిశ్రమ లేదు. ఇండస్ట్రీలో హీరోయిన్స్‌ని ఒక్కొక్కరూ ఒక్కోలా చూస్తారు. పెద్ద హీరోలున్న సినిమాల్లో హీరోయిన్లకు విలువే ఉండదు. కొందరు హీరోలు ట్రెండింగ్‌లో ఉన్న హీరోయిన్లను ఎంచుకుంటారు. మరికొందరు తమని డామినేట్ చేయని వాళ్లను హీరోయిన్లుగా తీసుకుంటారు. ఆ విధంగా హీరోయిన్లను హీరోలు డిసైడ్ చేస్తున్న రోజులువి. కొందరు నిర్మాతలైతే మాతో సినిమాలు చేస్తూ మమ్మల్ని ఉద్ధరిస్తున్నట్టు మాట్లాడతారు. ఇలాంటి వారందరితో పోరాటం చేస్తూ ముందుకెళ్తున్నాం. అందుకే పిచ్చిరాతలు రాయకండి.' అంటూ హెచ్చరించింది తాప్సీ పన్ను.

లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో, గురుప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ ఈ నెల 22న తెలుగులో విడుదల చేస్తున్నారు. తమిళంలో సూపర్‌హిట్ అయిన ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉందని, లక్ష్మీరాయ్ ఇందులో త్రిపాత్రాభినయం చేశారని, మాదక ద్రవ్యాలతో విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ ముఠా ఆటకట్టించే ఐపీఎస్ ఆఫీసర్‌గా, గ్రామాల్లో రౌడీల ఆగడాలకు అడ్డుకట్టవేసే ఉగ్రనారిగా, కుర్రకారుని ఉర్రూతలూగించే అందాలరాశిగా లక్ష్మీరాయ్ నట విశ్వరూపాన్ని ఇందులో చూస్తారని ప్రతాని రామకృష్ణగౌడ్ చెప్పారు. ఇంకా నటి ఆక్సాఖాన్, నటుడు జె.వి.ఆర్ కూడా మాట్లాడారు.

బ్లాక్ మ్యాజిక్ నేపథ్యంలో

'ప్రేమిస్తే'ఫేం భరత్, లేఖ ప్రజాపతి, స్నేహ అజిత్ ప్రధాన పాత్రధారులుగా సురేశ్ ఉన్నితన్ దర్శకత్వంలో రజిత్‌రావు నిర్మిస్తున్న చిత్రానికి 'బ్లాక్ మ్యాజిక్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఆదివారం ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉందని, డిసెంబర్లో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత రజిత్‌రావు తెలిపారు. లాల్, అజ్మల్ అమీర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, కథనం: శ్రీకుమార్ అర్కూటీ, కెమెరా: జామ్ అయ్యనాథ్, సంగీతం: బిజిబాల్, ఆర్.సోమశేఖరన్, విష్ణు మోహన్‌సితార, నేపథ్య సంగీతం: గోపీ సుందర్, నిర్మాణం: ఏ2బీ ప్రొడక్షన్స్.

నచ్చితేనే సినిమా చూడండి

విప్లవ్ నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఈసారైనా'. అశ్విని కథానాయిక. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే కథ. ఓ నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ, అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఎలా సాగాడు? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా ఉంటుంది. అందరికీ నచ్చేలా తీశాం. నచ్చితేనే సినిమా చూడండి.' అని విప్లవ్ అన్నారు. ఇంకా కథానాయిక అశ్విని, చైల్డ్ ఆర్టిస్ట్ కార్తికేయ, సహనిర్మాత సంకీర్త్, నటుడు ప్రదీప్ రాపర్తి తదితరులు మాట్లాడారు.

లేడీ కిల్లర్

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న యాక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్'. పూర్వాజ్ కీలక పాత్ర పోషిస్తూ, స్వీయదర్శకత్వంలో ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డిలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమాలోని జ్యోతి పూర్వాజ్ పాత్రను పరిచయం చేస్తూ మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఓ చేత్తో గొడ్డలి పట్టుకొని, మరో వైపు కూరగాయల సంచిని భుజాన తగిలించుకొని సీరియస్‌గా చూస్తున్న జ్యోతి పూర్వాజ్‌ని ఈ ఫస్ట్‌లుక్‌లో చూడొచ్చు. వెనుక అద్దంలో జ్యోతి పూర్వాజ్ ప్రతిబింబానికి బదులుగా గొడ్డలి పట్టుకున్న ఉమెన్ రోబో కనిపిస్తుండటం ఈ పోస్టర్‌లో విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, నిర్మాణం: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్‌ఆర్, ఏయు అండ్ ఐ.

ఆ నలుగురే నన్ను నిలబెట్టారు

'తెలుగు పరిశ్రమతో నాకు అనుబంధం ఏర్పడిపోయింది. ఇక్కడి ప్రేక్షకులు నన్నెంతో ఆదరిస్తున్నారు. ఈ బంధం ఇలాగే ఉండాలని ఆశిస్తున్నా. దర్శకుడు నాగ్ అశ్విన్, స్వప్నదత్ ఇద్దరు తొలుత 'మహానటి'కోసం నన్ను కలిశారు. అప్పుడు నాకు తెలుగు రాదు. కానీ ఆ రోజు వారిద్దరూ నన్ను మీ ముందు నిలబెట్టారు. ఆ తర్వాత హను రాఘవపూడి 'సీతారామం'తో గుర్తుండిపోయే విజయాన్నిచ్చారు. ఇప్పుడు వెంకీ అట్లూరి. చూడ్డానికి కుర్రాడిలా ఉంటాడు కానీ.. ప్రతిభావంతుడు. ఇందులోని ప్రతి పాత్రకూ తను ప్రాణం పోశాడు. వెంకీతోపాటు సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా.' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'లక్కీభాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా విజయోత్సవ సభ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా దుల్కర్ మాట్లాడారు. అతిథులుగా విచ్చేసిన దిల్‌రాజు, దర్శకులు నాగ్‌అశ్విన్, హను రాఘవపూడి చిత్ర యూనిట్‌కి అభినందనలు అందించారు. 'మా 'లక్కీభాస్కర్'తో పాటు దీపావళికి విడుదలైన సినిమాలన్నీ విజయం సాధించడం ఆనందంగా ఉంది. దుల్కర్‌తో పనిచేయాలనే కోరిక 'లక్కీభాస్కర్'తో తీరింది. సింగిల్ సిట్టింగ్‌లో కథ ఓకే చేశారాయన. మీనాక్షి చౌదరి, సచిన్ ఖేడ్‌కర్, సాయికుమార్, కసిరెడ్డి ఇలా అందరూ తమ పాత్రలకు పూర్తిగా న్యాయం చేసి సినిమాను నిలబెట్టారు. టెక్నీషియన్స్ కూడా ప్రాణం పెట్టి పనిచేశారు.' అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు. ఇంకా కథానాయిక మీనాక్షి చౌదరి, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, నటుడు సాయికుమార్ తదితరులు కూడా మాట్లాడారు.

అనుబంధం తెచ్చిన తంటా

'తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఈ అనుబంధం వల్ల కథానాయిక జీవితంలో ఏర్పడిన ఒడిదుడుకుల్ని హీరో ఎలా సరిదిద్దాడు అనేది కథ. ఇది మంచి ప్రేమకథ కూడా. కథ రిత్యా విదేశాల్లో షూటింగ్ జరగాలి. అందుకే పోలెండ్‌ని ఎంచుకున్నాం. ఇంటర్వెల్ దాకా మంచి సాంగ్స్, లవ్ ట్రాక్‌తో కథ సరదాగా సాగుతుంది. ఇంటర్వెల్ తర్వాత కథ కీలకమలుపు తీసుకుంటుంది. అదేంటో తెరపైనే చూడాలి' అని దర్శకుడు సాయికిశోర్ మచ్చా అన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ధూం ధాం'. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించారు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం దర్శకుడు సాయికిశోర్ విలేకరులతో ముచ్చటించారు. ఈ సినిమాను ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ వారు విడుదల చేస్తుండటం ఆనందంగా ఉందని, హీరో చేతన్ అన్ని ఎమోషన్స్నూ అద్భుతంగా పండించాడనీ, తనకు ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెడుతుందని, హెబ్బా పటేల్ పాత్ర ఆకట్టుకునేలా ఉంటుందని ఆయన తెలిపారు. గోపీసుందర్ సంగీతం, గోపీమోహన్ కథ, కథనాలు ఈ సినిమాకు ప్రధాన బాలాలని దర్శకుడు సాయికిశోర్ మచ్చా తెలిపారు.

గీత రచయితగా రికార్డ్

గీతరచయిత అనంతశ్రీరామ్ బెస్ట్ లిరిక్ రైటర్‌గా ఐఫా అవార్డును దక్కించుకున్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ముఖ్య తారలుగా సాయిరాజేశ్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన 'బేబీ'(2023) చిత్రం కోసం అనంతశ్రీరామ్ రాసిన 'ఓ రెండు మేఘాలిలా..' పాటకు ఈ అవార్డు లభించింది. దీంతో 'బేబీ' సినిమాకు బెస్ట్ లిరిక్ రైటర్‌గా అన్ని మేజర్ సంస్థల అవార్డ్స్‌నూ అనంతశ్రీరామ్ అందుకున్నట్టయ్యిందని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా అనంతశ్రీరామ్‌ని అభినందిస్తూ 'బేబీ' టీమ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రేక్షకుల రివార్డుల తోపాటు ప్రతిష్టాత్మక అవార్డులు కూడా 'బేబీ'ని వరిస్తున్నాయంటే.. ఈ ఘనత ఈ ప్రేమకథను హృద్యంగా తెరకెక్కించిన దర్శకుడు సాయిరాజేష్‌కే దక్కుతుందని నిర్మాత కొనియాడారు. సాయిరాజేశ్ దర్శకత్వంలో ఈ సినిమా హిందీలోనూ రీమేక్ అవుతున్న విషయం తెలిసిందే.

సవాళ్లను ఎదుర్కొని చేసిన సినిమా

సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'రహస్యం ఇదం జగత్'. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానసవీణ, భార్గవ్ గోపీనాథం ఇందులో ముఖ్యతారలు. కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకుడు. పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మాతలు. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయికలు స్రవంతి ప్రత్తిపాటి, మానసవీణ ఆదివారం విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో నా పేరు అరుణి ఆచార్య. నా పాత్రతో పాటు ఈ కాన్సెప్ట్ నన్నెంతో ఆకర్షించింది. ఛాలెంజ్‌గా తీసుకొని చేసిన పాత్ర ఇది. దర్శకుడు ఎంతో పాషన్‌తో ఈ కథ రాసుకున్నారు. భవిష్యత్‌లో ఆయన నుంచి మరిన్ని మంచి సినిమాలు ఆశించొచ్చు. అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుంది' అని కథానాయిక మానసవీణ నమ్మకం వెలిబుచ్చారు. 'ఇందులో నా పాత్ర పేరు అకిరా. అందరికీ నచ్చే పాత్ర ఇది. హనుమంతుడు వేరే లోకాలకు ట్రావెల్ చేసినప్పుడు ఏం జరిగింది? అనేది ఈ కథలో ఆసక్తికరమైన అంశం. టైమ్ ట్రావెల్ కూడా ఈ కథలో భాగమే. నిర్మాణ సమయంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. దర్శకుడు కష్టపడి ఈ సినిమాను తీశారు. ఆడియన్స్‌కి మంచి థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా అవుతుంది.' అని స్రవంతి ప్రత్తిపాటి చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanch